ఓం నమఃశ్శివాయ

- ద్వాదశ జ్యోతిర్లింగాలు, రుద్రాక్షల శివలింగం ప్రారంభం
- భక్తి భావన ఉద్దీపనం చేస్తుందన్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



రుద్రాక్షల శివలింగాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలో గురువారం ప్రజాపిత బ్రహ్మకుమారి సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలు, రుద్రాక్షలతో చేసిన శివలింగాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రతి ఏటా బ్రహ్మకుమారీలు ద్వాదశ జ్యోతిర్లింగాలు, రుద్రాక్షల శివలింగాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని, ఇది ప్రజల్లో భక్తిభావం పెంచుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఓంకాంతి సిస్టర్ రమణి, జ్యోతి, అర్చన, పాలకమండలి సభ్యులు సాధన మున్నా, జయశ్యామ్, 1వ పట్టణ సీఐ అంజుయాదవ్, పార్టీ నాయకులు సెన్నీరు కుప్పం శేఖర్, వెంకట సుబ్బయ్య, స్వామిరెడ్డి భరత్‌రెడ్డి, బాలగౌడ్, సునీల్, తేజ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు 300మంది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలందించనున్నారు. పురపాలక, జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల నుంచి స్కౌట్స్ గైడ్స్, రోవర్స్, రేంజర్స్ కలిసి సేవా కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతున్నారు. వీరికి భక్తులతో నడచుకోవాల్సిన విధానంపై శిక్షణ ఇచ్చారు.



స్కౌట్స్, అండ్ గైడ్స్

ముక్కంటి బ్రహ్మోత్సవాల్లో నేడు

శ్రీకాళహస్తి రూరల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు మాఘ బహుళ ద్వాదశి శుక్రవారం నాగరాత్రి నాలుగవ తిరునాళ్ల సందర్భంగా ఉదయం 9 గంటలకు స్వామి వారు హంస వాహనంపై, జ్ఞాన ప్రసూనాంబ శుక వాహనంపై పుర వీధుల్లో విహరిస్తారు. ఈ ఉత్సవాలకు మండలంలోని చుక్కలనిడిగల్లుకు చెందిన 42 ఎకరాల భూదాత, దివంగత ఎస్ఐ ముద్దుకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరిస్తారు. రాత్రి 8 గంటలకు స్వామివారు శేషవాహనం, అమ్మవారు యాళి వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

క్లుప్తంగా

ఎంపీ గురుమూర్తికి ఆహ్వానం



ఎంపీ గురుమూర్తికి ఆహ్వాన పత్రికను ఇస్తున్న చైర్మన్ బాలాజీ రెడ్డి, సభ్యులు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లె శ్రీ పళ్లికొండేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని ఎంపీ మద్దెల గురుమూర్తికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి ఆహ్వానపత్రికను అందజేశారు. గురువారం తిరుపతిలోని ఎంపీ స్వగృహానికి పాలక మండలి చైర్మన్, సభ్యులు వెళ్లి కలిశారు. ఈ నెల 18న శనివారం మహా శివరాత్రి పర్వదినంతో పాటు శని మహా ప్రదోషం ఒకే రోజు వస్తుందని, తప్పక హాజరై స్వామివారి సేవలో పాల్గొనాలని ఎంపీని కోరారు. అనంతరం పళ్లికొండేశ్వరాలయ ప్రధాన అర్చకులు కార్తికేయ గురుక్కళ్ ఎంపీకి ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక ఆహ్వానితులు రాధాక్రిష్ణా రెడ్డి, సభ్యులు ఆనందుడు, ఎస్ఎం సురేష్, మునివేలు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు



వైవీ సుబ్బారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న అంజూరు, మహీధర్‌రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. తిరుమల-తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికలను అందజేసి ఉత్సవాలకు తప్పకుండా రావాలని కోరారు. వారికి ముక్కంటి ఆలయ వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు మహీధర్ రెడ్డి, పార్టీ నాయకులు లోకేష్‌యాదవ్, ఆలయ అధికారులు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో చురుగ్గా పాల్గొనాలి



స్కౌట్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి రూరల్: ప్రతి విద్యార్థి తమ విధిగా సామాజిక సేవల్లో పాల్గొనాలని ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణన్ అన్నారు. మండలంలోని రాచగున్నేరి జెడ్పీ హైస్కూలులో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. సంఘ సేవకులు భక్తవత్సలం నాయుడు స్కౌట్ విద్యార్థులకు యూనిఫాం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయుడు లింకన్, ప్రజా ప్రగతి ట్రస్ట్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపులో నిర్లక్ష్యం



తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని తాటిపర్తి పంచాయతీ కల్లిపూడి గ్రామ ఎస్సీ కాలనీకి వెళ్లే దారి, గంగమ్మ గుడి, స్కూల్ పక్కనే గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకుపోతున్నా అధికారులు తొలగించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా, పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇకనైనా చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

భక్తిప్రపత్తులతో ధ్వజారోహణం





ధ్వజారోహణం నిర్వహిస్తున్న ఆలయ పూజారి, పుర వీధుల్లో ఊరేగుతున్న ఉత్సవమూర్తి

ఏర్పేడు: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో గురువారం ధ్వజారోహణం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయంలో ప్రత్యేక క్యూలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. గణపతి పూజ, చండీశ్వర, సుబ్రమణ్యేశ్వర, ఆనందవల్లీ దేవీ ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. వేద పండితులు ధ్వజస్తంభానికి తొలుత దర్భతో వేసిన పవిత్ర దారం, వస్త్రాన్ని అలంకరించారు. మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి పర్యవేక్షణలో ఉత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. పలు ప్రాంతాల భక్తులు దర్శించుకున్నారు.

గజవాహనంపై నీలకంఠుని చిద్విలాసం





గజ వాహన సేవలో ఉభయదారులు, అర్చకులు, గ్రామ పెద్దలు, కోలాట బృందం ప్రదర్శన

- సురుటుపల్లెలో వైభవంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లెలోని ప్రముఖ సర్వమంగళాదేవి సమేత పళ్లికొండేశ్వ స్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజైన గురువారం రాత్రి నీలకంఠుడైన పరమశివుడు గజ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో కొలువుదీరిన స్వయంభు వాల్మీకేశ్వరస్వామి, మరగదాంబిగ తాయారు, పళ్లికొండేశ్వర స్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి, దాంపత్య దక్షిణామూర్తిలకు ప్రత్యేక అభిషేకం చేశారు. వివిధ రకాల పుష్పాలతో విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా యాగశాల పూజలు చేశారు. సాయంత్రం పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను పట్టు పీతాంబరాలు గజ పుష్పమాలలు, విశేషాభరణాలతో అలంకరించారు. గజ వాహనంపై పరమేశ్వరుని, పల్లకిలో పార్వతీదేవిని కొలువుదీర్చి ఊరేగించారు. అడుగడుగునా భక్తుల కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో కళాకారుల బృందం అన్నమయ్య కీర్తలను ఆలపించింది. ఉభయదారులుగా బి.మాధవి, జేబీఆర్ మునిరత్నం కుటుంబ సభ్యులు వ్యవహరించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఈఓ రామచంద్రా రెడ్డి, బోర్డు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు రాధాక్రిష్ణా రెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

కులమతాలకు వైఎస్సార్‌సీపీ అతీతం

బుచ్చినాయుడుకండ్రిగ: కులమతాలకు వైఎస్సార్ సీపీ అతీతమని మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు, మాజీ ఎంపీటీసీ దేవత చిన్నమ్మ తెలిపారు. గురువారం ఆమె బుచ్చినాయుడుకండ్రిగలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నేత లోకేష్ పాదయాత్రలో సీఎం, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని ఆక్షేపించారు. లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో మహిళా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా నాయకులు

పనికిమాలిన పాదయాత్ర చేస్తున్న ‘పప్పు పులకేశి’

బుచ్చినాయుడుకండ్రిగ: సత్యవేడు నియోజక వర్గంలో పనిమాలిన పాదయాత్ర చేస్తున్న పప్పు పులకేశి ..లోకేష్ స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని విమర్శించే అర్హతలేదని జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, వైస్ ఎంపీపీ కారణి మున్నెమ్మ, కాటూరు ఎంపీటీసీ సభ్యుడు రవి ఓ ప్రకటనలో ఖండించారు.నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని లోకేష్‌ను హెచ్చరించారు.

సిబ్బంది కొరత వల్లే సమస్య

కేవీబీపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది కొరత మూలాన వైద్యసేవల్లో జాప్యం చోటుచేసుకుంటోందని వైద్యాధికారి డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. గురువారం సాక్షి దినపత్రికలో వైద్యం అందక మహిళ పరిస్థితి విషమం శీర్షికతో ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. మూర్ఛకు గురైన ఓళ్లూరుకు చెందిన రేఖను చికిత్స నిమిత్తం పీహెచ్‌సీకి తీసుకువచ్చిన సమయంలో రాత్రి షిఫ్ట్ విధులు నిర్వర్తించిన ఇద్దరు ఏఎన్ఎంలు ఈ ఘటనకు కేవలం 10 నిమిషాల ముందు డ్యూటీ ముగించుకుని వెళ్లిపోయారని, ఇక డాక్టర్ వాణి డిప్యుటేషన్‌పై కుప్పంబాదురు వెళ్లారని, ఉన్న ఇద్దరు స్టాఫ్ నర్సులు మరో ప్రత్యామ్నాయ ఉద్యోగానికి వెళ్లిపోయినట్లు తెలిపారు. దీనికి తోడు ఇక్కడ పనిచేస్తున్న 11 మంది ఎంఎల్‌హెచ్‌పీలు తిరుపతిలో శిక్షణ తరగతుల్లో ఉన్నారని, ఈ కారణంగా సచివాలయ ఏఎన్ఎంలను రెండు షిఫ్టులకు వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కీళపూడిలో ఉచిత పశువైద్య శిబిరం



పశువులకు మందును పిచికారీ చేస్తున్న పశువైద్య శాఖ ఏడీ ఇందిర

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడిలో పశు సంవర్ధక శాఖ గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించింది. స్థానిక పశువైద్య శాఖ ఏడీ ఇందిర, పశు వైద్యాధికారి ధనంజయులు 15 ఆవులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి చికిత్స చేశారు. 21 దూడలకు నట్టల నివారణకు మందులు తాపించారు. 74 పశువులకు పిడుదల నివారణకు మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు రఘు, గంగాధర్, గురవయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

టెన్నిస్‌లో శ్రీకాళహస్తి క్రీడాకారుని ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న విశాల్‌రాజ్

శ్రీకాళహస్తి: నరసారావుపేటలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 టెన్నిస్ పోటీల్లో స్థానిక సెయింట్ జేవీఎస్ పాఠశాల 10వ తరగతి విద్యార్థి విశాల్‌రాజ్ కాంస్య పతకం సాధించాడు. అతడిని స్కూలు యాజమాన్యం, టెన్నిస్ కోచ్ అభినందించారు.

● కళా నీరాజనం





స్వరూపానందగిరి స్వామి ప్రవచనం, వాసవి మహిళా మండలి సభ్యుల గానం



వర్ధమాన సినీ గాయకులు కార్తికేయన్ బృందం

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తీశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలలో గురువారం ధూర్జటి కళా ప్రాంగణంలో పలువురు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శ్రీవాసవి మహిళా మండలి రేణుకమ్మ బృందం భక్తి రంజని కార్యక్రమం, పసుమర్తి బృందం కర్ణాటక సంగీతం, శ్రీనివాస మంగాపురం శ్రీ స్వరూపానందగిరి స్వామి ప్రవచనం, అత్రితాత్రి, శ్రీకాళహస్తికి చెందిన అక్షయ చరిత, కాంచీపురానికి చెందిన భరతాలయ నృత్యకేతన్ బృందం, బద్వేలుకు చెందిన శివం, సతీష్, శ్రీకాళహస్తికి చెందిన యోగీశ్వరి నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. వర్ధమాన సినీ గాయకులు, ‘పాడుతా తీయగా’ గాయకులు యం.యల్.ఆర్. కార్తికేయన్ బృందం భక్తి సంగీత విభావరి, మోక్షిత, యజ్ఞశ్రీ ఇంద్రజాల ప్రదర్శనలు భక్తులను పులకరింపచేశాయి. శ్రీ జ్ఞానప్రసూన్నాంబ సమేత వాయులింగేశ్వర నాట్యమండలికి చెందిన చెంబేటి ఆనంద్‌బాబు పంచతంత్రం నాటకాన్ని ప్రదర్శించారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- శ్రీకాళహస్తి డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి



డీఎం రాజవర్ధన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో 18 నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆరోజుల్లో భక్తులు పెద్ద సంఖ్యలో రానున్న దృష్ట్యా ఈ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శ్రీకాళహస్తి-తిరుపతి మధ్య 19 నాన్‌స్టాప్ సర్వీసులు, మరో 12 పల్లె వెలుగు సర్వీసులు నడుస్తుండగా అదనంగా 50 ట్రిప్పులు నడపనున్నట్లు చెప్పారు. పిచ్చాటూరు మార్గంలో 7 సర్వీసులు ఉండగా అవసరాన్ని బట్టి అదనంగా నడుపుతామన్నారు. నాయుడుపేట మార్గంలో ప్రస్తుతం రెండు సర్వీసులకు తోడు మరో సర్వీసు, చెన్నైకు ప్రస్తుతం ఆరు సర్వీసులకు అదనంగా మూడింటిని, గుడిమల్లానికి ఒక సర్వీసు, చెన్నై మార్గంలో తడ వరకు ఒక సర్వీసు నడపనున్నట్లు వెల్లడించారు. మహాశివరాత్రి బస్సు సర్వీసులన్నిటిపై శివరాత్రి వాల్‌పోస్టర్లు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రధాన ఉత్సవాలు జరిగే నాలుగురోజులు బస్సు సర్వీసులన్నింటినీ స్వర్ణముఖి బస్టాండ్ వరకు కొనసాగించనున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు వితరణ



విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు అందజేస్తున్న సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు లలిత, తంబాసుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 528 మంది విద్యార్థులకు గురువారం సర్పంచ్ లలిత భర్త కరుణాకరన్, మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, భార్య ఉమ మధ్యాహ్న భోజనం చేసేందుకు స్టీల్ ప్లేట్లు వితరణ చేశారు. అలాగే 7 తరగతి గదులకు రూ.1,12,000 లతో ఇనుప గేట్లు, రూ.36 వేలతో 11 సీసీ కెమెరాలను అమర్చారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని దాతలు చెప్పారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎస్‌చంద్ర, ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేక పూజలు





విశేషాలంకరణలో భ్రమరాంబికా సమేత మల్లిఖార్జునస్వామి, ఆలయంలో పూజలు చేస్తున్న పూజారులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట భ్రమరాంబికా సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో గురువారం మహా కుంభాభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూలవిరాట్టుకు విశేష అలంకరణ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు.

అసత్య ఆరోపణలు మానుకో లోకేష్



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సత్యవేడు: యువగళం పాదయాత్రలో లోకేష్ అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదని సత్యవేడు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కే. సుశీల్ కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్‌చైర్మన్ కే. చంద్రశేఖర్ రెడ్డి ఖండించారు. గురువారం సాయంత్రం పార్టీ నాయకులతో కలసి మీడియాతో మాట్లాడారు. పాదయాత్రలో లోకేష్ అబద్ధాలు చెప్పడం, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై అసత్య ఆరోపణలు చేయడం ఎంతమాత్రమూ తగదన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆదిమూలం, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై కువిమర్శలు చేశారని మండిపడ్డారు. యూనివర్సిటీలో చదివే రోజుల్లోనే చంద్రబాబును పెద్దిరెడ్డి ఓడించారని లోకేష్ గుర్తెరగాలని హితవు పలికారు. నియోజవర్గంలో యువగళం పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. సమావేశంలో ఎంపీ రవి, రాబిన్, పునిదకుమార్, కృష్ణయ్య, టెంకాయల కృష్ణయ్య, పూల పళని, నరేష్, చిన్నబ్బ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న అలంకరణలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు భక్తులను మైమరిపిస్తున్నాయి. ఆలయం వద్ద, పట్టణంలో పలు ప్రాంతాల్లో దేవతా మూర్తుల విద్యుత్ కటౌట్లు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. ఇక స్వర్ణముఖి నదిలో ఏర్పాటు శివలింగానికి జలాభిషేకం చేసే వినాయక ప్రతిమ ఎంతగానో ఆకట్టుకుంటోంది.









మాజీ జెడ్పీటీసీ సరస్వతమ్మ మృతి



సరస్వతమ్మ (ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని తొండంబట్టుకు చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు రావూరి సరస్వతమ్మ (80) గురువారం ఉదయం మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. 2014-2019 మధ్యలో ఆమె జెడ్పీటీసీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు (శ్రీకాళహస్తి), హేమలత (సత్యవేడు) టెలిఫోన్‌లో ఆమె తనయుడు కరుణాకర్ నాయుడిని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ చిన్నా, ఇతర పార్టీ నాయకులు సరస్వతమ్మ మృతదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

లోకేష్ పాదయాత్రతో ఒరిగేదేమీ లేదు

కేవీబీపురం: తెలుగుదేశం పార్టీ నాయకుడు నారా లోకేష్ యువగళం పేరుతో చేస్తున్న పాదయాత్ర కేవలం అధికార పార్టీపై విమర్శలకే పరిమితమని, ఆయన పాదయాత్ర వలన రైతులు, ప్రజలకు ఒరిగేదేమీ లేదని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి, సీపీఎం సీనియర్ నేత దాసరి జనార్దన్ అన్నారు. కేవీబీపురంలో గురువారం జరిగిన యువగళం పాదయాత్రను ఉద్దేశించి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లోకేష్ పాదయాత్ర అధికారం కోసమేనని, కేంద్ర ప్రభుత్వం పెంచుతున్న నిత్యావసర వస్తువులు,పెట్రో రేట్లపై లోకేష్ నోరు మెదపకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, సొంత డబ్బా కొట్టుకుంటున్నారని అపహాస్యం చేశారు. పాదయాత్రతో టీడీపీ ఏమాత్రమూ బలపడదని, దీనిని ఆపేయడమే మేలని ఆయన సూచించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి: బాల్య వివాహాల నిర్మూలన, వెట్టిచాకిరీ వ్యవస్థలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాయవాదులు పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి ఆదేశాల మేరకు పట్టణంలోని భరద్వాజ ఎస్టీకాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులు మాట్లాడుతూ, మైనర్లను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.